



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

చెక్‌పోస్టుల్లో సిబ్బంది చేతివాటం

- మార్కెట్ శాఖ ఆదాయానికి గండి
- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్


జిల్లాలోని మార్కెటింగ్ చెక్ పోస్టుల్లో రుసుము వసూళ్లలో సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. దీంతో మార్కెటింగ్ శాఖకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతుంది. ఇటీవల మార్కెటింగ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో సిబ్బంది చేతివాటం వెలుగు చూసింది. చెక్‌పోస్టుల్లో వచ్చిన భారీ వాహనం నుండి వసూలు చేయాల్సిన రుసుమును సిబ్బంది వసూలు చేయకుండా చేతివాటం ప్రదర్శించి వచ్చిన లోడ్‌ను తగ్గించి బిల్లులు రాసి పంపుతున్నట్లు తేలింది. చెక్ పోస్టుల్లో జరుగుతున్న అక్రమాలపై అధికారులు ఆరా తీయగా సిబ్బంది వాహనదారులతో కుమ్మక్కైనట్లు బయట పడింది.

జిల్లాలో ఎక్కువగా వరి పంటను సాగు చేస్తారు. ప్రస్తుత పంట పూర్తి కావడంతో వరి ధాన్యం ఎక్కువగా లారీలలో లోడ్ చేసి రవాణా చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా 24 చెక్‌పోస్టులు ఉన్నాయి. వాటిలో 6 చెక్ పోస్టుల నుండి అధిక ఆదాయం వస్తుంది. ఏ.కోడూరు, చాగలమర్రి, నన్నూరు, ఆళ్లగడ్డ, వెలుగోడు, ఆత్మకూరు చెక్ పోస్టుల నుండి అధిక ఆదాయం వస్తుంది. రబీ సీజన్ పూర్తి కావడంతో ఎక్కువ వరి ధాన్యాన్ని రైతులు వ్యాపారులకు అమ్ముతున్నారు. వాటిని లారీలలో లోడ్ చేసి మిల్లులకు తరలిస్తుంటారు. అధికారుల లెక్కల ప్రకారం చెక్ పోస్టులో టన్నుకు రూ.1,800 నుండి రూ.2 వేల వేల వరకు వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది టన్నులను తగ్గించి రుసుము వసూలు చేయడంతో మార్కెట్ ఫీజు అనుకున్న రీతిలో రావడం లేదు. హెవీ లారీకి అయితే రూ.10 వేల నుండి రూ. 12 వేల వరకు, మినీ లారీలకు అయితే రూ.5 వేల నుండి రూ.8 వేల వరకు మాత్రమే వసూలు చేస్తున్నట్లు రికార్డులలో లెక్కలు ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అక్రమాలు జరుగుతున్నట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రూ.26.66 కోట్ల వరకు మార్కెటింగ్ ద్వారా వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటి వరకు చేసింది రూ.4.27 కోట్లు మాత్రమే. వచ్చే మార్చి నాటికి ఇంకా రూ.21 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. తనిఖీలు చేయడం ద్వారా ఆదాయం పెరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నూనెపల్లి వ్యవసాయ మార్కెట్ తనిఖీ కేంద్రం



చెక్ పోస్టుల్లో అక్రమాలకు చెక్ పెడతాం



జిల్లాలోని చెక్ పోస్టుల్లో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెడతాం. ఇక నుండి రెగ్యులర్‌గా చెక్ పోస్టులను తనిఖీలు చేస్తాం. ప్రధాన చెక్‌పోస్టుల్లో అవినీతికి పాల్పడే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. సిబ్బంది పక్కాగా హెవీ వాహనాల నుండి మార్కెట్ రుసుము వసూలు చేయాలని ఆదేశాలు ఇస్తాం...

- ఎస్. అబ్దుల్ రహిమాన్, అగ్రీ మార్కెటింగ్ జిల్లా అధికారి.

మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రణాళిక

- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాదక ద్రవ్యాల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25పై సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో మత్తు పదార్థాల నివారణకు భారత ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని 2020లో ప్రవేశ పెట్టిందన్నారు. ఈ మేరకు మాదకద్రవ్యాల నివారణకు సంబంధిత అధికారుల నుండి నివేదికలు సేకరించి పకడ్బందీ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలి అన్నారు. పాఠశాల, కళాశాలలు, విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వ్యసనాలకు బానిసైతే కలిగే దుష్ప్రభావాలపై వీడియోలు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జన సమాచార ముఖ్య కూడలి ప్రాంతాలలో హోర్డింగులు ఏర్పాటుతో పాటు, వాల్ పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ కరపత్రాలు కళాశాలల ఆడిటోరియం, క్యాంటీన్, లైబ్రరీలలో ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక బృందాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల నివారణ కోసం జూన్ 1వ తేదీ నుండి 26వ తేదీ వరకు సంబంధిత అధికారులు బృందాలుగా వెళ్లి నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా అవగాహన తీసుకు రావాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25లో చేర్చాల్సిన అంశాలపై డిఈఓ, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్, ఎఎస్పి, జువైనల్ హోం సూపరింటెండెంట్, డీఆర్డిఏ కోఆర్డినేటర్, డిఐఓ, మెప్మా, వైద్య సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయీజ్ ఫాతిమా, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్, డీఈఓ జనార్దన్ రెడ్డి, డిఐఓ సుశీల, ఐసిడిఎస్ పిడి లీలావతి, జువైనల్ హోం సూపరింటెండెంట్ హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

ఇంటర్ 'సప్లి' పరీక్షలకు పకడ్బంధీ ఏర్పాట్లు

- 12 నుండి 20వ తేదీ వరకు పరీక్షలు
- 42 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ : డిఆర్ఓ డి.రాము నాయక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్‌లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12వ తేది నుంచి 20వ తేది వరకు జరుగుతాయన్నారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సర పరీక్షలు, మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 10,192 మంది, వొకేషనల్ 587 మొత్తంగా 10,779 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 2,959 మంది, వొకేషనల్ 366 మొత్తంగా 3325 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలను 42 పరీక్షా కేంద్రాల్లో (ప్రభుత్వ జూనియర్ కళాశాలలు-19, ఏపి మోడల్ స్కూల్స్-2, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలు-19) నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఆశా, ఎఎన్ఎంలతో మెడికల్ కిట్స్ ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పరీక్షా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్స్ మూసి ఉంచేలా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సున్నిత, సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా పూర్తి అయిన తర్వాత పరీక్షా పత్రాలను ఎప్పటికపుడు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఐఒ సునీత, డిఈసి మెంబెర్స్ రామన్, కృష్ణయ్య, ప్రభాకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల పై అధికారులతో సమీక్షిస్తున్న డిఆర్ఒ

ఆర్‌యూలో రాజకీయ జోక్యం తగదు

- నంద్యాలలో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి
- ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్ ఎంఆర్ నాయక్

ప్రజాశక్తి - నంద్యాల

రాయలసీమ యూనివర్సిటీలో రాజకీయ నాయకుల జోక్యం తగదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్ ఎంఆర్ నాయక్ పేర్కొన్నారు. రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధిపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్ ఎంఆర్ నాయక్, ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్పలు ఆర్‌యూ వీసీ వెంకట బసవరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి యూనివర్సిటీ అభివృద్ధిపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ 2010లో కర్నూలులో రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని, ఆర్‌యూతో సమానంగా ఏర్పడ్డ యూనివర్సిటీలన్నీ అభివృద్ధి వైపు ప్రయాణిస్తూ ఉంటే ఆర్‌యూ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే విధంగా ఉందన్నారు. యూనివర్సిటీలో కుల, గ్రూప్, బయట నుండి రాజకీయ నాయుకుల జోక్యం అధికంగా ఉండటం, యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ యూజీసీను ఏమాత్రం లెక్క చేయకుండా రాజకీయ నాయకుల ఆగడాల వలన యూనివర్సిటీ అభివృద్ధి అందని ద్రాక్షలా మారిందన్నారు. 2020లో వచ్చిన రూస నిధులు నేటికీ ఉపయో గించకపోతే కొత్త నిధులు ఎలా మంజూరవుతాయని ప్రశ్నించారు. విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లు కాగితంలో కూడా నాణ్యత లేకపోవడం, పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి అయినా ఆర్‌యూలో మాత్రం ఆలస్యంగా జరపడం, పరీక్ష ఫలితాలు నెలలు తరబడి విడుదల చేయకపోవడం, నిర్వహణలో సరైన ప్రణాళిక లేకపోవడం, పరీక్షల విభాగం పరిపాలన లోపం వెరసి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో ఆటలాడడం సరైంది కాదన్నారు. నంద్యాల జిల్లాలో ఆర్‌యూ అనుబంధ డిగ్రీ, బిఈడి కళాశాలలు 50కి పైగా ఉన్నాయని, ఆర్‌యూ పరిపాలన సరిగ్గా లేక విద్యార్థులలో అసంతృప్తి పెరుగుతుందన్నారు. సర్టిఫికెట్ కోసం యూనివర్సిటీ అధికారులు పదే పదే విద్యార్థులను తిప్పుకుంటున్నారని చెప్పారు. నంద్యాలలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌యూ అనుబంధ డిగ్రీ, పీజీ, బిఎడ్ కళాశాలల ఆర్థిక దోపిడీలను అరికట్టాలన్నారు. యూనివర్సిటీ లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి, అభివృద్ధికి రూ.200 కోట్లు నిధులకు నూతనంగా ఏర్పాటు అవుతున్న ఈసీ కమిటీ కృషి చెయ్యాలని కోరారు. యూనివర్సిటీలో విద్యార్థులకు అవసరం ఉన్న కోర్స్ లేక ఇతర జిల్లాలకు వెళుతున్నారని, కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో రాజకీయ జోక్యంకు వ్యతిరేకంగా పోరాడాలని, యూనివర్సిటీ స్వయంప్రతిని కాపాడాలని, ఏపీ పీజీ సెట్‌ను వ్యతిరేకించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ, నాయుకులు తదితరులు పాల్గొన్నారు.



విసిని కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

జవాన్ వీరమరణం బాధాకరం : మంత్రి బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందడం బాధాకరమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలం పుట్ట గుండ్లపల్లి తండాకు చెందిన మురళి నాయక్ దేశం కోసం వీరమరణం పొందడం మనసు కల చివేసిందన్నారు. మురళి నాయక్ వీరమరణం తెలుగు ప్రజలకే గాక దేశ ప్రజలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. సరిహద్దుల్లో మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశానికే కాక రాష్ట్ర ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. **నంద్యాల అర్బన్ :** పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందడం బాధాకరమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యుద్ధంలో మురళి నాయక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. **నంద్యాల రూరల్ :** పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మురళి నాయక్ వీరమరణం పొందడం బాధాకరమని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల నాయక్ అన్నారు. మురళి నాయక్ ప్రదర్శించిన ధైర్యసహసాలకు యావత్ భారతదేశం ఆయనకు సెల్యూట్ చేస్తుందన్నారు.

కస్తూరి భా గాంధీ బాలికల విద్యాలయాలు అప్‌గ్రేడ్

- అవసరమైన వసతులకు నిధులు మంజూరు : ఎంపీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 249 కస్తూరీభా గాంధీ గురుకుల పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ (జూనియర్ కళాశాలలు) చేసి అవసరమైన వసతులకు నిధులు మంజూరు చేసినట్లు నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని డోన్, గోస్పాడు, కొలిమిగుండ్ల, జూపాడు బంగ్లా, బండి ఆత్మకూరు, ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు, పగిడ్యాల, గడివేముల, నంద్యాల-2, ఆళ్లగడ్డ, దొర్నిపాడు, అవుకు, సిరివెళ్ల, పాణ్యం, మిడ్తూరు, బనగానపల్లె, కొత్తపల్లి, సంజామల తదితర మండలాల్లోని కస్తూరీభా గాంధీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసి అవసరమైన అదనపు గదులు, ఇతర మౌలిక వసతులకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు.

మండల వైద్యాధికారిగా డాక్టర్ ఆంజనేయులు



ప్రజాశక్తి - శిరివెళ్ల : శిరివెళ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ ఆంజనేయులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన డాక్టర్ దివ్య ఉన్నత చదువుల కోసం వెళ్లినట్లు తెలిపారు. డాక్టర్ ఆంజనేయులు గతంలో యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి హైదరాబాదు నందు పని చేశారు. డాక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని తెలిపారు. సిహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి, రవికిషోర్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత : సూపర్‌వైజర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ప్రస్తుత సమాజంలో బాల్యవివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అంగన్వాడీ సూపర్వైజర్ దస్తగిరమ్మ అన్నారు. కిషోరి వికాసం (కౌమార బాలికల సాధికారత) వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పునరుత్పత్తి ఆరోగ్యం-బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు అంశంపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని 5వ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ గుల్జార్ ఆధ్వర్యంలో 15 నుంచి 18 సంవత్సరాల బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ దస్తగిరమ్మ బాల్య వివాహాలు వలన కలిగే అనార్థాలపై, అలాగే పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 9, 19, 21వ అంగన్వాడీ కేంద్రాల వర్కర్లు శాంతమ్మ, సుశీల, హుస్సేనమ్మ, ఎంఎస్కె గ్రీష్మ, ఆశా వర్కర్ అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని 5వ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్వైజర్

ఉపాధి పనులను డ్వామా పీడీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గోస్పాడు

మండలంలోని పసురుపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధి పనులను పరిశీలించి, కూలీలతో ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా ఉదయం 6 నుండి 10 గంటలలోపు పనులను ముగించుకోవాలని సూచించారు. కొలతల ప్రకారం పని చేసి రూ. 307 దినసరి వేతనాన్ని పొందాలని, ప్రతి ఒక్క కూలీ వారి వెంట కచ్చితంగా పలుగు, పారా, కొడవలి వంటి పనిముట్లను తెచ్చుకోవాలని సూచించారు. కాలువలలో విషపూరితాలను గమనిస్తూ, శబ్దాలు చేసుకుంటూ పనులు చేయాలని, ఎండ తీవ్రత పెరిగేకొద్దీ తలకు రుమాలు కట్టుకొని పనులు చేయాలన్నారు. తగినంత మంచినీరు వెంట తెచ్చుకోవాలన్నారు. అనంతరం తాను మండలానికి వచ్చానన్న సమాచారాన్ని సంబంధిత మండల అధికారికి చరవాణి ద్వారా విషయం తెలుపగా ఏపీవో గంగన్న హుటాహుటిన పసురుపాడు గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఏపీవో గంగన్న, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పలు విషయాలను సూచించారు.




ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

విఆర్ఓ నిర్వాకంతో తప్పుడు ఎఫ్ఎంసి జారీ

- నలుగురు సంతానం కాగా ముగ్గురు మాత్రమేనని ధ్రువీకరణ పత్రం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

విఆర్ఓ నిర్వాకంతో తప్పుడు ఫ్యామిలీ మెంబెర్స్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసి) ఉన్నతాధికారులు జారీ చేసిన ఘటన నంద్యాల అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. వివరాలు.. నంద్యాల పట్టణంలోని వెంకటాచలం కాలనీకి చెందిన షేక్ జమాల్ బి, షేక్ చిన్నగపూర్ బాషాకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. అయితే ముగ్గురే సంతానమని విఆర్ సంబంధిత ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుడు ధ్రువీకరణ పత్రం జారీ చేయించినట్లు బాధితుడైన పెద్ద కుమారుడు షేక్ ఖాదర్ బాషా వాపోయాడు. శుక్రవారం విలేకరులతో పెద్దకుమారుడు షేక్ ఖాదర్ బాషా మాట్లాడుతూ... తన తల్లి షేక్ జమాల్ బీ చనిపోవడంతో తనకు తెలియకుండా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా అందులో తన పేరు లేకుండా ముగ్గురు కుమారులు మాత్రమే సంతానం అంటూ విఆర్ఓ తప్పుగా ధ్రువీకరిస్తూ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం ఉన్నత అధికారులచే జారీ చేయించారన్నారు. మిగిలిన వారు తనను వారసుడు కాదని, తనకు ఆస్తి చెందదంటూ అంటున్నారని అన్నారు. ఈ విషయంపై విఆర్ఒను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం జరగకపోతే చట్టపరంగా ముందుకు వెళ్తానని పేర్కొన్నాడు.



తప్పుడు ధ్రువీకరణ పత్రం చూపిస్తున్న బాధితుడు

పాకిస్తాన్‌కు ప్రధాని మోడీ గుణపాఠం చెప్పారు

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పాకిస్తాన్‌కు దేశ ప్రధాని నరేంద్ర మోడీ సరైన గుణపాఠం చెప్పారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పహాల్గాంలో విహారయాత్రకు వెళ్లిన వారిని పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్చి చంపడం దారుణమన్నారు. ఇందుకు ప్రతి చర్యగా ప్రధాని ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ ఉగ్రవాదులపై, వారి స్థావరాలపై భారత సైన్యంతో దాడులు నిర్వహించి తుదుమట్టించారన్నారు. ప్రధాని మోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. భారత సైన్యాన్నికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలపాలన్నారు.



మాట్లాడుతున్న గడ్డం రామకృష్ణారెడ్డి

రజతోత్సవ కుంభాభిషేకం విజయవంతం

- ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య

ప్రజాశక్తి - బనగానపల్లె

కోవెలకుంట్లలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి రజతోత్సవ కుంభాభిషేక కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం కోవెలకుంట్ల అధ్యక్షులు పెండేకంటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో రజతోత్సవ కుంభాభిషేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరా రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా మండలి అధ్యక్షురాలు వందన మహిళా మండలి సభ్యుల సహకారంతో అమ్మవారి పూజా కార్యక్రమాలు, ఒడి బియ్యం కార్యక్రమం ఘనంగా నిర్వహించారన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు కర్నాటి అభిలాష్ యువజన సంఘం సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమంలో చురుకుగా సేవ చేశారని తెలిపారు. పెండేకంటి సుబ్రహ్మణ్యం దాదాపు మూడు నెలల నుండి చాలా కష్టపడి ఆర్యవైశ్య పెద్దల సలహాలను తీసుకుని ఈ రజతోత్సవ వేడుకలను వైభవంగా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం శాశ్వత గౌరవాధ్యక్షులు పిఎస్ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు భరతుడు, కాసుల జంగం శెట్టి, బింగుమళ్ల సుబ్రహ్మణ్యం, కేతేపల్లి శివరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టంగుటూరి శీనయ్య



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవ ధాన్యాలతో భూసారం పెంపు

ప్రజాశక్తి - రుద్రవరం : ఖరీఫ్ సాగులో వ్యవసాయ రైతులు 30 రకాల నవధాన్యాలను భూమిపై చల్లడం వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఎంసిఆర్‌పి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో ప్రకతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులు తీసుకోవలసిన యాక్షన్ ప్లాన్‌ను, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో వచ్చే ధాన్యం వల్ల మనుషులు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు ప్రతి రైతూ ముందుకు సాగాలని తెలిపారు.

12 గంటలకే సచివాలయం ఖాళీ

- సిబ్బంది లేక ఖాళీగా కుర్చీలు - కార్యాలయం వెలవెల

ప్రజాశక్తి - శిరివెళ్ల : శిరివెళ్ల మండలంలోని కోటపాడు గ్రామంలో గల సచివాలయం శనివారం మధ్యాహ్నం 12 గంటలకే ఖాళీ అయిపోయింది. సచివాలయంలో పని చేసే అధికారులు, సిబ్బంది లేక కార్యాలయం ఖాళీ కుర్చీలతో వెలవెలబోతోంది. సచివాలయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది 12 గంటల సమయంలో ఒక్కరు కూడా వారికి కేటాయించిన సీట్లలో కనిపించకపోవడం శోచనీయం. కూటమి ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలకు సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని చెబుతున్నా కిందిస్థాయిలో ఆ మాటలను గాలికి వదిలేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల నమోదు ప్రక్రియను చేపట్టింది. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రేషన్ కార్డు నమోదు చేసేలా సచివాలయంలో సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించింది. కానీ కోటపాడు సచివాలయంలో మాత్రం సిబ్బంది సహచర ఉద్యోగులతో ఇతర కార్యాలయాల్లోకి వెళ్లి కాలక్షేపం, కబుర్లు మాట్లాడుకోవడం, అవసరమైతే సెలవులు పెట్టి వెళ్లడం ఆనవాయితీగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమయాభావం పాటించాలని అధికారులు చెబుతున్న ఆదేశాలు తుంగలో తొక్కి ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. ఎంపీడీవో, ఈవోపీఆర్డి, ఇతర మండల స్థాయి అధికారులు తరచూ సచివాలయాలను తనిఖీలు చేసి సిబ్బంది విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న సచివాలయం

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

• సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసురత్నం



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం

ప్రజాశక్తి - ఆత్మకూర్

కార్మికులకు ఉద్యోగులకు ప్రజలకు నష్టం కలిగించే కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసురత్నం పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ అధ్యక్షతన శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎల్ఐసి యూనియన్ నాయకులు విజయ్ కుమార్, నాగన్న, ఎన్జీవోస్ సంఘం తాలూకా సహాయ కార్యదర్శి రాజశేఖర్, బ్యాంకు యూనియన్ నాయకులు ఆంజనేయులు, సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, ఏపీ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మా బాష, వీరన్న, వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు మల్లయ్యలు మాట్లాడారు. బ్రిటీష్ కాలం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు, బడా పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేసే పద్ధతిలో నాలుగు సివిల్ కోడ్‌లుగా విభజించి కార్మికులు కట్టు బానిసల్లాగా పని చేసేలా చేస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను అడ్డుకోవడానికి మే 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. **అలాగే..** కరివేన గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి కూలీల దగ్గరకెళ్లి వారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి పెంచిన వేతనానికి సరిపడే బడ్జెట్ కేటాయించలేదన్నారు. కార్మిక, కర్షక, ప్రజల, కూలీల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెల్యే అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, వ్యవసా కార్మిక సంఘం నాయకులు మౌలాలి, వెంకటసుబ్బయ్య, దేవమ్మ, లింగస్వామి, శేఖర్, శివయ్య పాల్గొన్నారు.

బేతంచెర్ల ఎపిఎం, సిసిలను సస్పెండ్ చేయాలి


బేతంచెర్ల మండలంలోని సిమెంట్ నగర్ గ్రామం సచివాలయం వద్ద జరిగిన జరిగిన సంఘటనకు బాధ్యులైన ఎపిఎం మధు సుదర్శన్ గౌడ్, సిసి వెంకటేశ్వర్లను సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసురత్నం, సిఐటియు ఆత్మకూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రజాక్, డి. రామ్ నాయక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ నాయకులు తమ అనుయాయులకు విఒఎ పోస్టులు ఇప్పించుకోవడం కోసం ప్రభుత్వ నిబంధనలను తుంగలోతొక్కి ఏళ్ల తరబడి పని చేస్తున్న విఒఎలను తొలగిస్తూ గ్రామాల్లో ఘర్షణలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ తొలగింపులు ఆపాలని జిల్లా పీడీకి పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా.. తీరు మారడం లేదని విమర్శించారు. జిల్లా పీడీ అండతోనే బేతంచెర్ల ఎపిఎం, సిసిలు ఇప్పటికే చాలా మందిని తొలగించారని ఆరోపించారు. వెంటనే ఎపిఎం, సిసిలను తొలగించని ఎడల పీడీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

• వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. నాగేశ్వర్ రావు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఆందోళన చేపడతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు బి. బాలస్వామితో కలిసి ఆయన శుక్రవారం పర్యటించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని చేసిన కూలీలకు ప్రతివారం బిల్లులు చెల్లించాలని ఉన్నప్పటికీ ఐదు వారాలుగా బిల్లులు చెల్లించకుండా ఉపాధి కూలీలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. పనుల దగ్గర సౌకర్యాలు లేక ఉపాధి కూలీలు వడదెబ్బకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టం వచ్చి 20ఏళ్లు అవుతున్నా అనేక మంది ఉపాధి కూలీలకు సరిపడ పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. కూలీలు ఉపాధి పనులకు రాలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం రోజు వేతనం రూ. 307 ప్రకటించినా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న వంటగ్యాస్ ధరలు, విద్యుత్ ఛార్జీలు, పెట్రోలు, డీజిల్, నిత్యవసర సరుకుల ధరలు ఆకాశ నటుతున్నాయని ఉపాధి కూలీల వేతనాలు గొర్రె తోక బెత్తడు మాదిరిగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. అలాగే ఉపాధి మేటీలకు సెల్ ఫోన్‌తో పాటు ప్రతికూలిపైన రూ.5 పారితోషకం చెల్లించాలని కోరారు. ఉపాధి పనుల దగ్గర నీడ వసతి కల్పించి వేసవికాలంలో మజ్జిగ పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆటో సౌకర్యం కల్పించాలన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు

దామగట్లలో ఉపాధి గ్రామ కమిటీ ఎన్నిక

దామగట్ల ఉపాధి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్యక్షులు సరోజమ్మ, కార్యదర్శిగా ఉసేనయ్య, ఉపాధ్యక్షులు విజయరాజు, సహాయ కార్యదర్శిగా రంగస్వామి, కమిటీ సభ్యులుగా బక్కమ్మ, మార్తమ్మ, శ్రీనివాసులు, తిరుపాలప్ప, ఆంజనేయులు, జనార్ధన్, హుస్సేన్‌బీ, రామ గోవిందు, సువార్తమ్మ, మద్దమ్మ, మునిస్వామితోపాటు మరో 15 మందితో కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సమ్మె నోటీస్ అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ప్యాపిలి : అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు, మండల కార్యదర్శులు టి.శివరాం, ఎ.వి.భాస్కర్ రెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సులోచన, సుమలత, యశోద ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగన్నకు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అఖిల భారత కార్మిక సంఘాలు, ఎఐఎఫ్ డబ్ల్యూహెచ్, స్వతంత్ర ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ అంతరాయం : ఎఇ


ప్రజాశక్తి - కొత్తపల్లి : కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ హబీబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. మండలంలో ఉన్న పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ పరిధిలో ఉన్న పలు పనులను చేసేందుకు విద్యుత్ అంతరాయం విధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

కౌలు రైతులు గుర్తింపు పత్రాలు తీసుకోవాలి : ఎఒ



ప్రజాశక్తి - బేతంచెర్ల : కౌలుకు పొలాలు తీసుకొని సాగు చేసుకుంటున్న కౌలు రైతులు వెంటనే కౌలు గుర్తింపు పత్రాలు తప్పకుండా తీసుకోవాలని ఎఒ కిరణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు కౌలు గుర్తింపు పత్రాలు వెంటనే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. కౌలు గుర్తింపు పత్రాలు ఉంటే రైతులకు ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు, పంట లాభాలు, రుణాలు, పంట బీమా, పంట నష్టపరిహారం, పంటకు మద్దతు ధర మొదలగు లాభాలు పొందొచ్చన్నారు. గ్రామాల్లోని విఆర్ఒలు లేదా రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి కౌలు గుర్తింపు పత్రాలకు ఆధార్ కార్డు, యజమాని పట్టాదారు పాసు బుక్కు, ఒక పాస్ ఫోటో సమర్పించి కౌలు పత్రాన్ని పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భయభ్రాంతులకు గురి చేయడం దారుణం



తహశీల్దార్ వెంకట రమణకు వినతి పత్రమిస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి - గడివేముల : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజరెడ్డి ఇంట్లోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి, భయభ్రాంతులకు గురి చేయడం హేయమైన చర్య అని పాత్రికేయులు అన్నారు. ఈ ఘటనకు నిరసనగా గడివేముల తహశీల్దార్ వెంకటరమణకు విలేకరులు శుక్రవారం వినతి పత్రం అందజేసి మాట్లాడారు. విజయవాడలోని ఎడిటర్ ధనుంజయ్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇవ్వకుండా ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి విధ్వంసం సృష్టించడం అమానుషమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, పత్రికా సేచ్ఛను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారాధినిగా పని చేస్తున్న మీడియాపై దాడులకు ఉసికొల్పడం మంచి పద్ధతి కాదన్నారు. వినతి పత్రమిచ్చిన వారిలో మండల విలేకరులు సోపిసాహేబ్, ఎల్ల సుబ్బయ్య, మస్తాన్, ప్రసాద్, హరున్ తదితరులు ఉన్నారు.

అటవీ సంపద ఆగమాగం

- గొడ్డలి వేటుకు కనుమరుగవుతున్న సంపద
- నిఘా లోపంతో అక్రమార్కులకు ఆదాయం
- కంచె చేను మేసిన చందంగా అధికారుల తీరు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని వన సంపద అక్రమార్కుల ఆగడాలతో ఆగమాగం అవుతోంది. కంచె చేను మేసిన చందంగా అటవీ శాఖ అధికారుల తీరు మారింది. అటవీ సమీప పరిసర ప్రాంతాల్లో పట్టపగలు కర్రలు, వెదురు బొంగులు ప్రతినిత్యం అక్రమార్కులు తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు ఉండడం పలు విమర్శలకు తావిస్తుందని స్థానికులు వాపోతున్నారు. శుక్రవారం తెలుగు గంగ బ్రిడ్జి సమీపంలో తెలుగుగంగ కాలువ నుంచి పిల్ల కాల్వ వద్ద వెదురు బొంగులు, పట్టుడు కర్రలను అక్రమార్కులు తరలించడానికి సిద్ధంగా ఉంచారు. అదే ప్రాంతంలో కాల్వలో సైతం వెదురు బొంగులను అక్రమంగా తరలించేందుకు నిల్వ ఉంచారు. కొందరు అటవీ శాఖ సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలపడంతోనే దట్టమైన అడవులు మైదాన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. కంచె చేను మేసిన చందంగా అధికారుల తీరు కనిపిస్తోంది. అక్రమ రవాణాను అరికట్టాల్సిన సంబంధిత అటవీ అధికారులు చోద్యం చూస్తూ ఉండటంతో లక్షల విలువైన సంపదను అక్రమార్కులు దోచుకుంటున్నారు. అటవీ సంపద అక్రమ వ్యాపారులకు మహానంది, చలమ రేంజ్ మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. మహానంది, చలమ రేంజ్ పరిధిలోని నల్లమల అడవి ప్రాంతం నుంచి అటవీ సంపదను బొలెరో వాహనాల్లో అక్రమంగా ప్రతి రోజు తరలిస్తున్నా అడ్డుకునే నాథుడే లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాతావరణం కలుషితం కాకుండా మానవాళిని కాపాడుతున్న పచ్చని చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. యథేచ్ఛగా అటవీ సంపదను తరలిస్తున్నారు. చలమ రేంజ్ పరిధిలో నలుదిశలా అడవి విస్తరించి ఉండడంతో ఏదో ఒక ప్రాంతం నుంచి అటవీ సంపద తరలిస్తూనే ఉంటారు. ఎంతో విలువైన అటవీ సంపదను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నా పట్టించుకునే వారే లేరని స్థానికులు చర్చించుకుంటున్నారు. కేసులు నమోదు చేస్తున్నారో లేదో కానీ అటవీ సంపద నరికివేత మాత్రం యథేచ్ఛగా సాగుతోంది. ప్రతి రోజు రాత్రివేళల్లో మహానంది మండలంలోని పలు అడవి ప్రాంతాల నుంచి రహదారి మార్గాల్లో అటవీ సంపద తరలుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమార్కులు తరలిస్తున్నారు. చేయి తడిపితే ఎటువంటి ఇబ్బంది ఉండదని, లేని పక్షంలో వేలకు వేలు అపరాధ రుసుం వేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విచక్షణారహితంగా అటవీ సంపద నరికివేయడంతో వాతావరణ సమతుల్యం దెబ్బతిని వర్షాలు కురవక కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంటుందని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. అడవులు కనుమరుగు అవడంతో వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అడవుల సంరక్షణ అనే కార్యక్రమాలు చేపడుతుంటే, మరోవైపు అక్రమార్కులు అటవీ అధికారుల అండతో యథేచ్ఛగా అటవీ సంపద నరుకుతూ అక్రమంగా రవాణా చేస్తున్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదం అధికారుల అలసత్వంతో కాగితాలకే పరిమితమైంది. ఈ ప్రాంతంలో జన సంచారం పెద్దగా లేకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్టపడడం లేదు. ఆయా జిల్లా ఉన్నతాధికారులు నిస్సహాయత స్థితిలోకి కనిపిస్తున్నారు. అడిగినంత ఇస్తే సరే లేదంటే అధికారులు అక్రమార్కులను సైతం ముప్పుతిప్పలు పెడుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు అటవీ సంపద అక్రమ రవాణాపై నిఘా ఉంచి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు, రైతులు కోరుతున్నారు.



వెదురు బొంగులను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన అక్రమార్కులు

వివాహితను హత్య చేసిన.. నిందితులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి - ప్యాపిలి

అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేసి వివాహిత మూడు నెలల గర్భిణి చిన్నారి(23)ని హత్య చేసిన నింధితులు అత్త హనుమక్క, మామ నరసింహులు, భర్త ఎల్లప్ప, బావ(విఆర్ఒ) ప్రహల్లాద్‌లను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకురాలు షమీంబేగం, మాధవి, షబానా, లక్ష్మీదేవీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న చిన్నారి మృత దేహానికి వారు శుక్రవారం నివాళ్లర్పించారు. చిన్నారి తల్లిదండ్రులు జయమ్మ, శ్రీనివాసులతో సమాచారం తెలుసుకొని షమీంబేగం మాట్లాడారు. గోరంట్ల గ్రామానికి చెందిన చిన్నారిని ఎరుకల చెరువు గ్రామానికి చెందిన ఎల్లప్పతో ఐదు నెలల కిందట అడిగినంత కట్నకానుకలిచ్చి పెద్దలు పెళ్లి చేశారని తెలిపారు. అదనపు కట్నం కోసం చిన్నారిని హత్య చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించి మహిళలకు భద్రత కల్పించాలని ఆస్పత్రి ఎదుటే ధర్నాకు దిగారు. అదనపు కట్నం కోసం అత్త, మామ, భర్త, బావ(విఆర్ఒ) ప్రహల్లాద్ చిత్రహింసలకు గురి చేస్తున్నా చిన్నారి అన్ని భరిస్తూ వచ్చిందన్నారు. ముక్కుపచ్చలారని మూడు నెలల నిండు గర్భిణీ అని కూడా చూడకుండా చిన్నారిని చిత్రహింసలకు గురిచేసి హత్య చేసి దానిని కప్పిపుచ్చేందుకు ఆత్మహత్య చేసుకుందని కట్టు కథలు అల్లారని ఆరోపించారు. వారు చేసిన హత్య బయటపడడంతో రాత్రికి రాత్రే అత్తా, మామ, భర్త, బావ అదృశ్యమై తలదాచుకున్నారని తెలిపారు. నిందితులను ఇప్పటికీ అరెస్టు చేయకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా హోం మంత్రి ఉన్నా మహిళలకు భద్రత కరువైందన్నారు. అదనపు కట్నాల కోసం మహిళలను వేధిస్తూ హత్యలు చేస్తున్న దుర్మార్గులకు ఏ రాజకీయ నాయకులు వత్తాసు పలకొద్దని, తక్షణమే చిన్నారిని హత్య చేసిన నలుగురు నిందితులను తక్షణమే అరెస్టు చేసి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల చిన్నారి కుటుంబంతో పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. పోస్ట్ మార్టం రిపోర్టు వచ్చాక కేసు నమోదు చేస్తామని సిఐ ఇంతియాజ్ బాష పేర్కొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఐద్వా నాయకురాలు

మూడు నెలలుగా అందని రేషన్ బియ్యం



ప్రజాశక్తి - సంజామల : మండలంలోని సి.కొత్తపేట గ్రామానికి చెందిన బుర్ర బాల స్వామి, బాబు, చిన్నమ్మలకు రేషన్ కార్డులు ఉన్నా గత మూడు నెలలుగా బియ్యం వేయడం లేదు. నిరుపేద కూలీలైన వారు రేషన్ బియ్యంపై ఆధారపడి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. మూడు నెలలుగా ఎండియు ఆపరేటర్ తమకు బియ్యం రావడం లేదని చెబుతూ వేయడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రేషన్ బియ్యం వేసేలా చూడాలని వేడుకుంటున్నారు.

కౌలు కార్డుల జారీ వేగవంతం : ఎఒ

ప్రజాశక్తి - కోవెలకుంట్ల : కౌలు కార్డుల జారీ వేగవంతం చేయాలని తహశీల్దార్ విఆర్ఒలకు ఆదేశించారు. శుక్రవారం కోవెలకుంట్ల తహశీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ అధికారి నిరంజన్ కలిసి తహల్దార్ విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కౌలు రైతులు అగ్రిమెంటు, యజమాని పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డుతో సంప్రదిస్తే వారికి నిజ నిర్ధారణ చేసి కౌలు కార్డులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఒలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : నియోజకవర్గంలోని ఉయ్యాలవాడ మండలం గోవింద పల్లెలో ఉమామహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పాల్గొన్నారు.. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకుల ఆహ్వానం మేరకు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఉమామహేశ్వర స్వామి ప్రతిష్ట ఉత్సవంలో పాల్గొని అనంతరం ఎద్దుల బండలాగు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం పరిధిలోని భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఇఒ ఎం. శ్రీనివాసరావు భద్రత విభాగాన్ని ఆదేశించారు. ముందుగా భద్రతా చర్యల్లోపై ఆయన శుక్రవారం మాట్లాడుతూ అన్ని చోట్ల తనిఖీలు చేయాలని ఆదేశించారు. భద్రత చర్యల్లో పోలీస్ శాఖ వారి పూర్తి సహాయ సహకారాలు పొందాలని పర్యవేక్షకులకు సూచించారు. ప్రధానంగా దేవస్థానం టోల్గేట్ వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. అదే విధంగా క్యూ కాంప్లెక్స్, క్యూ లైన్ల ప్రవేశ ద్వారం, ప్రధాన ఆలయం, క్షేత్ర పరిధిలోని జనసంచార ప్రదేశాలు, సాక్షి గణపతి, హటకేశ్వరం, పాలధార-పంచదార, శిఖరం మొదలైన చోట్ల భద్రత కట్టుదిట్టంగా ఉండాలన్నారు. క్షేత్ర పరిధిలోని ఆయా ప్రదేశాలన్నీ పస్పుటంగా కనపడేలా సీసీ కెమెరాల నిఘా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఇఒ ఆదేశించారు. జిల్లా ఎస్‌పి ఆదిరాజ్ సింగ్ రాణా, ఆత్మకూరు డిఎస్పి ఆర్. రామాంజి నాయక్ ఆదేశాల మేరకు పోలీసు శాఖ వారు భద్రతపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు.

శ్రీశైలంలో రెడ్ అలర్ట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా రెడ్ అలర్ట్ ప్రకటించడంతో నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి ఆర్. రామాంజీ నాయక్ పర్యవేక్షణలో శ్రీశైలం టెంపుల్‌లో భద్రతను కట్టు దిట్టం చేసినట్లు సిఐ ప్రసాదరావు తెలిపారు. అలాగే భద్రతలో భాగంగా శ్రీశైలంలోని అన్ని సత్రాలను, శ్రీశైలంకు వచ్చి పోయే వాహనాలను అర్ధరాత్రి శ్రీశైలం సిఐ, స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీ చేశారు. ఎవరిపైనా అయినా అనుమానం వస్తే వెంటనే పోలీసులకి గాని సెక్యూరిటీ సిబ్బందికి గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

ధర్మకర్తల మండలి నియామానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని దేవాలయాలకు ధర్మకర్తల మండలి నియామకం కోసం దేవాదాయ శాఖ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు బండి ఆత్మకూరు మండలం గ్రూప్ టెంపుల్స్ ఎఒ నాగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈర్నపాడు గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవ, ఈశ్వర, కోదండ రామస్వామి దేవస్థానానికి, బండి ఆత్మకూరు గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్ధన స్వామి, ఆంజనేయ స్వామి దేవస్థానానికి, సంత జుటూరు గ్రామంలో వెలిసిన శ్రీచెన్నకేశవ స్వామి ఆంజనేయస్వామి, పెద్ద దేవలాపురంలో వెలసిన వరదరాజస్వామి ఆంజనేయస్వామి, లింగాలమయ్య స్వామి, సింగవరంలో వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆంజనేయ స్వామి, కడమల కాల్వ గ్రామంలో వెలిసిన శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానానికి, అలాగే భోజనం గ్రామంలో వెలసిన ముక్తేశ్వర స్వామి దేవస్థానానికి ధర్మ కర్తల మండలి నియామకం కోసం ఆసక్తిగల సభ్యులు 9 మందికి మించకుండా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 25 సాయంత్రం లోపు రైతు నగరంలోని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి పంపించాలని ఆయన తెలిపారు.

వైభవంగా సీతారామచంద్రమూర్తి విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర వైశాఖ శుద్ధ ద్వాదశీ శుక్రవారం ఉదయం 09:45 ని.లకు హస్తానక్షత్రయుక్త మిథునలగ్న శుభపుష్కరాంశమందు శ్రీ సీతారామచంద్ర స్వామి, కామాక్షి సమేత శ్రీ కాశీ విశ్వనాథ స్వామి, పరివార దేవతల, నాభి శిల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వేదపండితులు మంత్రోత్సరణలతో వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ట మహోత్సవం తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం సాయంత్రం శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు భక్త జనుల సమక్షంలో కన్నుల పండుగగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అలాగే రాత్రి 07:00 గంటలకు శ్రీకామాక్షి సమేత శ్రీకాశీ విశ్వనాథ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభ వంగా నిర్వహించారు. విగ్రహ ప్రతి ష్టను పురస్క రించుకొని దేవాలయంలో నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, నంద్యాల పార్లమెంట్ ఇన్‌ఛార్జీ మాండ్ర శివానందరెడ్డి, బైరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, ఎంపిపి కుసుమలత, జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డిలు విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కమిటీ పెద్దలు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవానికి సర్వం సిద్ధం



ప్రజాశక్తి - సిరివెళ్ల : మండలంలోని కోటపాడు గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవానికి సర్వం సన్నద్ధం చేసినట్లు గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం చెన్నకేశవ స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకం, 12 గంటలకు కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం వసంతోత్సవ కార్యక్రమంతో కళ్యాణ మహోత్సవ వేడుకలు ముగుస్తాయన్నారు. చెన్నకేశవ స్వామి, వీరభద్ర స్వామి దేవస్థానాలను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ప్రాంతీయ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

• జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి



ప్రజాశక్తి - ప్యాపిలి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డోన్ శ్రీసుధా సిబిఎస్‌సి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈ నెల 11న నిర్వహించే నాలుగు జిల్లాల ప్రాంతీయ వర్క్‌షాపును విజయవంతం చేయాలని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మాణిక్యం శెట్టి తెలిపారు. స్థానిక కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో డోన్ డివిజన్ అధ్యక్షులు బి. సర్వజ్ఞమూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల జన విజ్ఞాన వేదిక నాయకులు వర్క్‌షాప్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సైన్స్ ఉద్యమం తాత్వికత, జన విజ్ఞాన వేదిక నిర్మాణ కర్తవ్యాల మీద చర్చించనున్నట్లు చెప్పారు. మాజీ శాసన మండలి సభ్యులు, ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావులు హాజరవుతారన్నారు. సమావేశంలో రాష్ట్ర మాజీ యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు ఎన్ఎస్ బాబు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు లతీఫ్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : తహశీల్దార్

ప్రజాశక్తి పాములపాడు

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని తహశీల్దార్ సుభద్రమ్మ సూచించారు. మండల కేంద్రమైన ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి టి. సరోజిని వర్జీనియ అధ్యక్షతన ఎంపిడిఒ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల చివరి వరకు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, పాత మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు అగ్రికల్చర్ ఎఇ మదిలేటి మాట్లాడుతూ పాములపాడు మండలానికి సంబంధించి 1100 కౌలు రైతులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వెటర్నరీ అధికారి మాట్లాడుతూ మండలంలో మూడు పశు వైద్యశాలలు ఉన్నాయని, ఇప్పటి వరకు 13 పశు వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి ఇంట్లో ప్రతి పశువులకు భీమా చేసుకోవచ్చని ఒక్కో పశువుకు రూ. 150 ఇన్సూరెన్స్ కట్టుకుంటే రూ. 30 వేల వరకు నష్టపరిహారం అందుతుందన్నారు. వెలుగు ఎపిఎం ఉమామహేశ్వరి మాట్లాడుతూ మండలంలో 1075 పొదుపు సంఘాలు ఉన్నాయని, 32 గ్రామ సంఘాలు ఉన్నాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సూపర్వైజర్ అన్నమ్మ మాట్లాడుతూ గర్భవతులు ప్రభుత్వ వైద్యశాల డెలివరీ చేసుకుంటే 6000 ప్రభుత్వం ఆర్థిక సహాయం ఇస్తుందన్నారు. అలాగే విద్యుత్, ఐసిడిఎస్ అడిషన్ సిడిపిఒ మంగవల్లి తదితరులు మాట్లాడారు. సమావేశంలో సర్పంచులు మాణిక్యమ్మ, మేకల భాగ్యమ్మ, ప్రసాద్ రావు, చింతల నారాయణ, ఎంపిడిఒ కార్యాలయం ఎంపిటిసి కలబండి రమాదేవి ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

తీరిన రహదారి కష్టాలు

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యం మండలంలోని డొంగురస్తా నుండి దుర్వేసి బాటవరకు దాదాపు 14 కిలోమీటర్ల మేర రూ. 6కోట్ల 29లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి పనులను ఎస్ఆర్బిసి అధికారులు శుక్రవారం పరిశీలించారు. రహదారిని నాణ్యతతో వేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నాణ్యత పనులను పరిశీలించిన అధికారులు పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు ఈ రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. పాణ్యం నుండి ఒడ్డుగండ్ల, రసుల్ల పేట, కొండ జూటూరు, గోరుకల్లు, కొట్టాల, దుర్వేసి గ్రామాల ప్రజలు పాణ్యంకు చేరుకోవడానికి చాలా సులువుగా ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రైతులకు ఈ రోడ్డు వల్ల చాలా సౌలభ్యం ఉంటుందని ఎస్ఆర్ బీసీ ఇఇ శుభకుమార్ పేర్కొన్నారు. పనులను పరిశీలించిన వారిలో డిఇ గీతావాణి, ఎఇఇ రాహుల్ తదితరులు ఉన్నారు.



బాల్య వివాహాలతో ప్రాణాలకు ముప్పు

• జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి స్వప్న ప్రియదర్శిని



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి స్వప్న ప్రియదర్శిని

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

బాల్య వివాహాలతో బాలికలతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదాలు ఉన్నాయని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వప్న ప్రియదర్శిని పేర్కొన్నారు. పట్టణంలోని బిఆర్ఆర్ నగర్‌లో బాల్య వివాహాలు-ఆరోగ్యంపై ప్రభావం అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... 12-18ఏళ్ల మధ్య గల బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే ప్రతికూల పరిణామాలను వివరించారు. పిన్న వయసులో గర్భధారణ, పునరుత్పత్తి ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలను వివరించారు. చిన్న వయసులో తల్లి అయిన వారికి వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఎఫ్ విజయలక్ష్మి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి లావణ్య, అంగన్వాడీ టీచర్ లక్ష్మీదేవీ, ఆశా వర్కర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

బేతంచెర్ల : బాల్యవివాహాలను ప్రోత్సహించడం నేరమని, వాటిని ప్రోత్సహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ ఆఫీసర్, ఎన్‌టిసి దుర్గయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ తిప్పమ్మలు పేర్కొన్నారు. బేతంచెర్ల పట్టణం సిమెంట్ నగర్ అంగన్వాడీ సెంటర్లలో కిషోర్ వికాసం కౌమార బాలికల సాధికారత, బాలికలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లపై ఎఎన్ఎం రేణుక, ఫరీదా భాను ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కిశోర బాలికలను సెల్ ఫోన్లకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచడం మంచిదన్నారు. యుక్త వయసులో ఉన్న బాలికలు సెల్ ఫోన్ల వినియోగంతో మానసిక సమస్యలు, చెడు ఆలోచనలు చెడు అలవాట్లు, చదువుపై అశ్రద్ధ వహించడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. అమ్మాయిలకు 18ఏళ్లు, అబ్బాయిలకు 21ఏళ్లనిండిన తర్వాత తల్లిదండ్రులు వివాహాలు చేస్తే మంచిదన్నారు. బాలికలు స్పర్శ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు గుల్జార్బి, నారాయణమ్మ, విజయలక్ష్మి, ఆర్ అంజలి, ఎం.కె నాగలక్ష్మి, మహాలక్ష్మి, రోజా, లక్ష్మీ, మహిళా పోలీస్ సింధు, మాధవి, ఆశా బేగం, ఆశా వర్కర్లు ఉమాదేవి, మహేశ్వరి, కిశోర బాలికలు, బాలికల తల్లులు వెంకటేశ్వరమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారుల బృందం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా శనివారం శ్రీ నటరాజ సంగీత నృత్య అకాడమీ గుంటూరు వారిచే శుక్రవారం నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది. ఆలయదక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద సాయంత్రం నుండి నృత్య ప్రదర్శన చేపట్టారు. వినాయకత్వం, శంభో శివ శంభో, నమశ్శివాయతే, నమోభవాయ, శివ పంచాంక్షారీ స్తోత్రం, శంకరగిరి, నటరాజ స్తోత్రం, అయి గిరి నందిని, శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు రాజనందిని, నిత్య, మనోజ్ఞ, శ్రీవల్లి, లాస్యశ్రీ తదితరులు ప్రదర్శించారు. ఈ నిత్యకళారాధనలో ప్రతి రోజు హరికథ, బుర్రకథ సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తి రంజని నిర్వహించారు.

శ్రీశైలంలో పరివార విశేష పూజలు

లోక కళ్యాణం కోసం శ్రీశైల క్షేత్ర గ్రామ దేవత శ్రీ అంకాళమ్మకి శుక్రవారం అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. విశేష పూజల్లో భాగంగా శ్రీఅంకాళమ్మకి అభిషేకం, విశేష అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రకృతి శక్తుల కళలే గ్రామ దేవతలని దేవీ భాగవతంలో చెప్పబడింది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవీ నాలుగు చేతులతో కుడివైపున కింది నుండిపై వరసలో కత్తి, సర్పముతో చుట్టబడిన ఢమరుకం, ఎడమవైపున పాన పాత్ర, త్రిశూలం ఉన్నాయి. అలాగే కర్ణాభరణాలు, కంఠాభరాణాలు కలిగి ఉంటుంది. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం విశేషాలు నిర్వహించారు. అలాగే నందిశ్వరస్వామికి విశేష పూజలు, ఊయల సేవ నిర్వహించారు.

పాఠశాలల ఏర్పాటులో అసంబద్ధతను తొలగించాలి

- ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

పాఠశాలల ఏర్పాటులో అసంబద్ధతను తొలగించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ... ప్రతి ప్రాథమిక పాఠశాల 1 నుండి 5 తరగతులు కలిగి ఉండాలని, కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బేసిక్ పాఠశాలలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20 గా ఉండాలని అన్నారు. ఉన్నత పాఠశాలలు 6వ తరగతి నుండి 10,12 తరగతి వరకు ఉండాలని కోరారు. 45 మంది విద్యార్థులు దాటితే మరొక సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. 12వ పీఆర్సీని నియమించి వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు మ్యాన్యువల్ విధానంలో చేపట్టాలని కోరారు. పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

- 15 లోగా దరఖాస్తు చేసుకోవాలి : బీసీ వెల్ఫేర్ అధికారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మెగా డిఎస్‌సికి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆర్.ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఈబిసి, ఎస్‌సి, ఎస్టీ కేటగిరీలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15 వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారు జిల్లా వెనుకబడిన తరగతుల, సాధికారత అధికారి వారి కార్యాలయం, ఓల్డ్ బిఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ (సి. బ్లాక్) నంద్యాలలో దరఖాస్తులు పొంది అక్కడే క్వాలిఫికేషన్, క్యాస్ట్, ఇన్ కం, ఆధార్ కార్డు, టెట్ హాల్ టికెట్, టెట్ మార్క్ లిస్ట్ జిరాక్స్ కాపీలు జతపరిచి ఇవ్వాలన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్



క్రీడలు మానసిక ఉల్లాసనికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ అన్నారు. ఈనెల 15న తేదీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పుట్టినరోజు సందర్భంగా 33వ వార్డు టిడిపి ఇంచార్జ్ జోసఫ్, 28వ వార్డు టిడిపి ఇంచార్జ్ కృపాకర్ ఆధ్వర్యంలో ఫరూక్ యువసేన సభ్యులు శుక్రవారం స్థానిక ఎస్పీజీ గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఎండి ఫయాజ్ పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల డయాసిస్ సెక్రటరీ జెక్కమ్ స్టాన్లీ విలియమ్స్, ఫరూక్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకి సేవ మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె



మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రూప్-1, 2 ఉచిత కోచింగ్ ప్రారంభం

శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి రామకృష్ణా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి రామకృష్ణా రెడ్డి తమ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు ఏర్పాటు చేసిన గ్రూప్-1,2 ఉచిత కోచింగ్‌ను నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మనోధైర్యంతో మౌలికంగా ఎన్సిఆర్‌టి పుస్తకాలు చదివితే బేసిక్స్ చాలా వరకు తెలుసుకోవచ్చన్నారు. హైస్కూల్ బుక్స్ సంపూర్ణంగా చదవాలని, ఎప్పటికప్పుడు చాప్టర్ వైజ్ చదవాలన్నారు. పర్సనల్ నోట్స్ కూడా తయారు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా గడిచిన ప్రశ్నాపత్రాలను బాగా పరిశీలించాలని, ఆబ్జెక్టివ్, మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ అని సాదాసీదాగా చదవడం వల్ల మెమరీ ఉండదని, సంపూర్ణంగా జ్ఞానాన్ని పొందాలంటే డిస్క్రిప్టివ్ పద్ధతిలో చదివి స్వతహగా ఆబ్జెక్టివ్స్ తయారు చేసుకోవాలని చెప్పారు. కళాశాల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్జన కాలంలోనే పోటీ పరీక్షలకు అనువైన జ్ఞానాన్ని అందించాలని, అందుకు మంచి సబ్జెక్ట్ ఎక్స్పర్ట్స్‌ను తెప్పిస్తున్నానన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కేబివి సుబ్బయ్య, కోచింగ్ ఇన్చార్జి రమేష్, అధ్యాపకులు కుమార్, బాలసుబ్రమణ్యం, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.